డబ్బు రోగం!

డెంగీ పేరుతో ప్రైవేట్ ఆస్పత్రుల దందా

ప్లేట్‌లెట్స్ తగ్గాయంటూ భయపెట్టి దోపిడీ

సాధారణ టెస్ట్‌లతోనే నిర్ధారణ.. చికిత్స

పట్టించుకోని జిల్లా వైద్యశాఖ అధికారులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

● అనంతపురం రూరల్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ టీచర్ కుమారుడు జ్వరంతో బాధపడుతుండగా సాయినగర్‌లోని ఓప్రైవేటు ఆస్పత్రికి మూడు రోజుల కిందట తీసుకొచ్చారు. ఇక్కడ ఆ అబ్బాయిని పరీక్షించిన డాక్టర్ ఇది డెంగీ ఫీవర్‌లా ఉంది. ప్లేట్‌లెట్స్ తగ్గాయి. ఇక్కడే అడ్మిషన్ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో ఆ టీచర్ ఆందోళనతో డాక్టర్ చెప్పినట్లు చేశాడు. ప్రతి రోజూ సగటున రూ.12వేలు వరకు ఫీజు వేస్తూ వస్తున్నారు. ఇప్పటికే రూ. 36వేలు వరకు బిల్లు అయ్యింది. కానీ జబ్బు తగ్గలేదు. ఇంకా కొన్ని రోజులు ఉంటే ఇంకెంత బిల్లు వేస్తారోనని ఆ టీచర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కళ్యాణదుర్గానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి తీవ్రజ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు ఉన్న ఓప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ అతడిని పరీక్షించిన డాక్టర్ 'చాలా నీరసంగా ఉన్నారు. ప్లేట్‌లెట్స్ కూడా తగ్గిపోయాయి. అడ్మిషన్ చేయాలి' అని సూచించారు. బంధువులు భయపడి అడ్మిట్ చేశారు. ఆతర్వాత రకరకాల పరీక్షలు చేయించి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉన్నందుకు రూ.58వేలు బిల్లు వేశారు.

● ఉరవకొండ మండలానికి చెందిన ఓ మహిళ జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులతో బాధపడుతుండగా చికిత్స కోసం జిల్లాకేంద్రంలోని నడిమివంక వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు ప్లేట్ లెట్స్ తగ్గిపోయాయి. వెంటనే ఎక్కించుకోవాలి లేకపోతే ప్రమాదమన్నారు. దీంతో దాదాపు రూ. 12వేలు వెచ్చించి ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. ఇక్కడ ఆస్పత్రిలో నాలుగు రోజులు ఉన్నందుకు, డాక్టర్లు, ఇతరత్ర ఖర్చుల కింద రూ.32వేలు బిల్లు వేసినట్లు బాధితుడు తెలిపాడు.

● పై సంఘటనలు మచ్చుకు మాత్రమే. ఇలాంటి సంఘటనలు జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా జరుగుతున్నాయి. కొన్నిప్రైవేట్ ఆస్పత్రుల దందాకు వందల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన జిల్లా వైద్య శాఖ అధికారులు మిన్నకుండిపోవడంతోనే ప్రైవేట్ ఆస్పత్రులు రోగాల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నాయి.

- అనంతపురం టౌన్

ప్రైవేట్‌లో సాధారణ పరీక్షలతో డెంగీ నిర్ధారణ

ప్రైవేట్ ఆస్పత్రులలో ప్రభుత్వ వైద్యశాఖల నిబంధనలకు విరుద్ధంగా డెంగీ గా నిర్ధారించి వైద్యం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం డెంగీ నిర్ధారణకు ల్యాబ్‌లలో ఎలీసా పరీక్షలు నిర్వహించాలి. అందులో పాజిటివ్ వస్తేనే డెంగీ ఫీవర్‌గా గుర్తించాల్సి ఉంటుంది. ఈ పరీక్ష చేసే అవకాశం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి, కదిరి, గుంతకల్లు ఆస్పత్రుల్లో మాత్రమే ఉంది. కానీ ప్రైవేటు ఆస్పత్రులు పెట్టుకున్న ల్యాబ్‌లలో ఎన్ఎస్-1 (డెంగీ నాన్‌స్ట్రక్చరల్‌ప్రొటీన్ 1)పేరుతో సాధారణ పరీక్షలు చేయించి డెంగీగా నిర్ధారించి రోగులను భయపెట్టి ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తూ దోపిడీ చేస్తున్నారు. ఒకవేళ రోగిలో డెంగీ లక్షణాలు కనిపిస్తే ఆరోగి వివరాలు డీఎంహెచ్ఓ ఆఫీస్‌కు తప్పనిసరిగా పంపాల్సి ఉంటుంది. అలా ఇవ్వడం వల్ల ప్రభుత్వ వైద్యశాఖ అప్రమత్తమై ఆరోగికి ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎలీసా పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగి నివసించే ప్రాంతాలలో డెంగీ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. కానీ ఇక్కడ ప్రైవేటు ఆస్పత్రులు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. అయినా ఈసీజన్‌లో ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా చికిత్స పొందుతున్న వారిలో పదులు సంఖ్యలో డెంగీ జ్వర పీడితులే ఉండటం గమనార్హం.

డెంగీ పేరుతో దందా

సీజనల్ వ్యాధుల కాలం వస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు పండగే. అమాయక ప్రజల భయాన్ని ప్రైవేట్ ఆస్పత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. జ్వరం, నొప్పులతో ఆస్పత్రికి వస్తే చాలు... రోగులు, వారి బంధువులకు తెలియని వైద్య పరిభాషలో రకరకాల పేర్లు చెప్పి భయపెడతారు. తర్వాత వివిధ రకాల పరీక్షలు చేయించి, పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, అడ్మిట్ కావాల్సిందేనని చెబుతారు. అడ్మిట్ అయిన తర్వాత పరీక్షలలో ఇది డెంగీ జ్వరంగా ఉందని అందుకే ప్లేట్‌లెట్స్ తగ్గాయంటారు. ఈ ప్లేట్‌లెట్స్ సంఖ్య ఇంత ఉండాలి. కానీ ఇంతే ఉన్నాయని చెప్పి వ్యాపారానికి తెరలేపుతున్నారు. అప్పటికే భయంలో ఉన్న రోగి బంధువులు డబ్బులు పోతే పోని రోగం బాగైతే చాలు అని అప్పులు చేసైనా ఆస్పత్రుల్లో బిల్లు కట్టేస్తున్నారు. ఆ భయమే ప్రైవేట్ ఆస్పత్రులకు కాసుల వర్షం కురిపిస్తోంది.

ఇప్పటికి 37 డెంగీ... మూడే మలేరియా కేసులట !

జిల్లాలో ఈఏడాది జనవరి నెల నుంచి ఇప్పటి వరకు 37 డెంగీ జ్వరాలు, మూడు మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయని జిల్లా వైద్యశాఖ చెబుతోంది. ఇందులో జనవరి నెలలో 08, ఫిబ్రవరిలో 05, మార్చిలో 13, ఏప్రిల్‌లో 04, మేలో 03, జూన్ నెలలో 04 డెంగీ కేసులు నమోదయ్యాయని చెబుతున్నారు. మలేరియా జ్వరాలు జనవరి నెల నుంచి ఇప్పటి వరకు కేవలం మూడు కేసులే నమోదయ్యాయట. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో డెంగీ, మలేరియా కేసులు పేరుతో చికిత్స పొందుతుండటం వైద్యశాఖ వర్గాలకు కనబడలేదేమో..!.



ఎలీసా పరీక్షలతోనే డెంగీ నిర్ధారించాలి



డెంగీని సాధారణ పరీక్షలతో నిర్ధారించలేం. అనుమానపు లక్షణాలు ఉంటే వారి సమాచారం జిల్లా వైద్యశాఖకు ఇస్తే మేము వెళ్లి రక్తనమూనాలు సేకరిస్తాం. వాటిని ప్రభుత్వ వైద్యకళాశాల ల్యాబ్‌కు పంపి ఎలీసా పరీక్ష చేయిస్తాం. అక్కడ పాజిటివ్ వస్తేనే ఆ కేసు డెంగీగా గుర్తించబడుతుంది. అలాకాకుండా సాధారణ టెస్టులు చేసి డెంగీ అంటూ రోగులను భయపెట్టడం చట్టవిరుద్ధం. మాకు సమాచారం ఇవ్వని వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. కలెక్టరు, డీఎంహెచ్‌ఓల దృష్టికి తీసుకెళతాం. జిల్లాలో డెంగీ పేరుతో జరిపే దందాలను అరికడతాం.

- డాక్టర్ ఓబులు, డీఎంఓ

దూకేద్దాం !


వైసీపీ కౌన్సిలర్ల చూపు **టీడీపీ వైపు**

పిలుపు కోసం ఎదురు చూస్తున్న వైనం



గుంతకల్లు మునిసిపాలిటీ

గుంతకల్లు, జూలై 2: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘనవిజయంతో క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఈక్రమంలోనే కొందరు ప్రజాప్రతినిదులు టీడీపీలో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఇదే వరుసలో గుంతకల్లు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు. ఎన్నికల ఫలితాలను ముందుగానే పసిగట్టిన నలుగురు కౌన్సిలర్లు గుమ్మనూరు జయరాంకు టిక్కెట్టు ఇచ్చిన వెంటనే టీడీపీలో చేరారు. ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోవడంతో వైసీపీ కౌన్సిలర్లలో అంతర్మథనం ప్రారంభమైంది. వైసీపీ హయాంలో వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదు. ఇప్పుడు పార్టీ అధికారంలో కూడా లేదు కనుక ఇదే పార్టీలో ఉంటే ఓటర్ల వద్ద పరపతి ఉండదనే ఉద్దేశ్యంతో కొందరు టీడీపీ వైపు చూస్తున్నారు. ఒకరి వెనుక ఒకరుగా ఎమ్మెల్యే జయరాంను కలిసి సన్మానాలు చేసి, తమ సంసిద్ధతను తెలియజేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ పదవి విషయంగా ఇప్పటికే వైసీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్న పరిస్థితుల్లో ఎమ్మెల్యే నుంచి గ్రీన్ సిగ్నల్ కోసం వేచి చూస్తున్నారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే కాలాన్ని నాలుగేళ్ల నుంచి కుదించడానికి ప్రభుత్వం యోచిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్న తరుణంలో గుంతకల్లు మునిసిపాలిటీలో రాజకీయం వేడెక్కుతోంది.



టీడీపీలోకి మరో ఏడుగురు?

ఎన్నికలకు ముందు నలుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా, ప్రస్తుతం మరో ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యేతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే జయరాం నివాసానికి వెళ్లి తమ అంగీకారాన్ని తెలుపుతున్నారు. వైసీపీ కౌన్సిలర్ల చేరికపై టీడీపీలో వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారు. మునిసిపల్ కౌన్సిల్‌లో టీడీపీకి ఏడుగురు సభ్యులు ఉన్నారు. వైసీపీ నుంచి వచ్చిన నలుగురితో కలుపుకుని ఇప్పుడు టీడీపీ బలం 11కి పెరిగింది. కౌన్సిల్‌లో చైర్మన్‌గిరి దక్కాలంటే 19 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరమౌతుంది. ఈ లెక్కన మరో ఎనిమిది మంది కౌన్సిలర్ల మద్దతు టీడీపీకి కావలసి ఉంటుంది. ఆ పరిస్థితి వస్తే వైసీపీ నుంచి 10 మందికి పైగా కౌన్సిలర్లు టీడీపీలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా మునిసిపాలిటీలో సీపీఐ నుంచి ఒక కౌన్సిలరు ఉన్నాడు. అతడి ఓటు కూడా టీడీపీకే వచ్చే పరిస్థితులున్నాయి. నియోజకవర్గంలో మునిసిపాలిటీ ఉంటే ఎమ్మెల్యేలు కౌన్సిల్ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఉంటారు. నియోజకవర్గంలో గుంతకల్లు, గుత్తి మునిసిపాలిటీలు ఉన్నాయి. ఒకటికి మించి మునిసిపాలిటీలుంటే ఎమ్మెల్యే ఎక్కడో ఒకచోట ఎక్స్ అఫిషియో మెంబర్‌గా పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పేరును నమోదు చేసుకున్నచోట చైర్మన్ ఎన్నికలో పాల్గొని ఓటువేసే అధికారం ఎమ్మెల్యేకు లభిస్తుంది. ఈ మేరకు ఎమ్మెల్యే గుంతకల్లు మునిసిపాలిటీలో తన పేరును నమోదు చేసుకునే అవకాశాలున్నాయి. తద్వారా టీడీపీకి ఓ ఓటు కలిసి వస్తుంది. ఎంపీ కూడా ఈ మునిసిపాలిటీలోనే పేరు నమోదు చేసుకుంటే రెండు ఓట్లు కలిసివస్తాయి.

మార్చికల్లా పరిస్థితి తారుమారు

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే కనీస గడువు నాలుగు సంవత్సరాల నుంచి తగ్గించకపోయినా వచ్చే మార్చికల్లా గుంతకల్లు మునిసిపాలిటీలో పరిస్థితులు తారుమారయ్యేలా కనిపిస్తున్నాయి. వైసీపీలోనే చైర్మన్ పదవిని పంచుకునే విషయంగా ఉన్న ఒప్పందం నెరవేరలేదు. కౌన్సిల్ అధ్యక్ష పదవి మొదటి రెండున్నర ఏళ్లు ప్రస్తుత చైర్‌పర్సన్ ఎన్ భవానికి, తర్వాతి రెండున్నరేళ్లు మరో కౌన్సిలరైన మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప సతీమణి వెంకట లక్ష్మికి ఇచ్చేలా ఒప్పందం జరిగింది. ఆ ఒప్పందం ముగిసి దాదాపు సంవత్సరం కావస్తోంది. కానీ అధికార మార్పిడి జరగకపోవడంపై వైసీపీ నాయకుడు గాది లింగేశ్వరబాబు (చిన్నబాబు) కినుక వహించారు. ఈ విషయంగా వైసీపీ అధిష్ఠానం చిన్నబాబుకు సర్దిచెప్పి ఎన్ భవానీని చైర్‌పర్సన్‌గా కొనసాగించింది. సంవత్సరం కిందట పదవీ గండం నుంచి గట్టెక్కిన చైర్‌పర్సన్ భవాని వచ్చే మార్చిలో మరో గండాన్ని ఎదుర్కోనున్నారు. ఈసారి గట్టెక్కగలరా, లేదా? అనేది వేచి చూడాల్సిందే.

గుత్తి మునిసిపల్ కౌన్సిలర్లు కొందరు ఎన్నికలకు ముందు టీడీపీలో చేరడానికి యత్నించారు. అయితే వారు కొన్ని డిమాండ్లు పెట్టడంతో చేరికపై జయరాం పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం అక్కడ కూడా కొందరు సభ్యులు టీడీపీలో చేరే యోచనతో ఉన్నారు. వచ్చే మునిసిపల్ ఎన్నికల్లో మరలా టిక్కెట్టును ఇచ్చేలా హామీ పొంది పార్టీ మారడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

పరిటాల రవి.. ఓ నిప్పు కణిక

మంత్రులు సత్యకుమార్, సవిత

వెంకటాపురంలో పరిటాల ఘాట్‌కు నివాళులు



పరిటాల ఘాట్‌కు నివాళులర్పిస్తున్న మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత

రామగిరి, జూలై 2: దివంగత పరిటాల రవీంద్ర ఒక నిప్పుకణిక అని, ఆయన బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురానికి మంగళవారం వారు విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంతా గ్రామంలోని యల్లమ్మ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరిటాల రవి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. అక్కడ పరిటాల రవి జీవితంలోని ముఖ్య ఘట్టాలతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను పరిశీలించారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ పరిటాల రవి అంటే పెత్తందారులు, భూస్వాములకు సరిపోదని, ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికి మరువలేమన్నారు. ధర్మవరంలో అరాచక శక్తులతో పోరాడి ప్రజలకు అండగా నిలిచారన్నారు. అందుకే ధర్మవరంలో నేటికి ప్రతి ఇంటిలో పరిటాల రవి పేరు చెప్పితే చిరునవ్వు, ధైర్యం కనిపిస్తాయన్నారు. ఆయన పెనుకొండ, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల ప్రజల కోసం ఎంతో సేవ చేశారన్నారు. ఆయన లక్షణాలు పరిటాల శ్రీరామ్ పుణికి పుచ్చుకున్నారన్నారు. ఆయన బాటలోనే శ్రీరామ్ నడుస్తూ ప్రజలకు అండగా నిలబడ్డాడన్నారు. వారి వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి మంజూరు చేయండి

వెంకటాపురం గ్రామానికి వచ్చిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు గ్రామస్థులు ఆస్పత్రి కావాలంటూ వినతి పత్రం అందించారు. తమ గ్రామానికి సమీపంలో ఉన్న నసనకోటలో ఆస్పత్రి ఉన్న అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్నారు. తమ గ్రామంలో రైతులతో పాటు కార్మికులు ఎక్కువ శాతం ఉన్నారని, పనుల్లో గాయపడితే చికిత్స కోసం 15 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో స్పందించిన మంత్రి ఆస్పత్రి ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఉద్యోగ విరమణోత్సవం

కలెక్టరేట్ వేదికగా కొత్త సంప్రదాయం



ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు

అనంతపురం అర్బన్, జూలై 2: ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఒకేచోట సత్కరించే వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్ శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన 70 మంది జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఒక్కొక్కరికి ఒక మొక్కను అందజేశారు. ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగంలో చేరిన మొదటి రోజు నుంచి విరమణ చేసే చివరి రోజు వరకూ ఎంతో ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ఉద్యోగులుగా ప్రతి ఒక్కరి సేవలు అమూల్యమైనవని అన్నారు. పదవీ విరమణ చేసిన తర్వాత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఉద్యోగ విరమణ రోజునే పెన్షన్‌ను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జీపీఎఫ్ స్పాట్ పేమెంట్ అయ్యేలా చూస్తామన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు మొక్కల పెంపకానికి అంబాసిడర్‌లుగా పనిచేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసినవారు తమ ఇళ్ల వద్ద మొక్కను నాటి, ప్రతిజ్ఞ పత్రాన్ని జడ్పీ సీఈఓకు పంపాలని కోరారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జడ్పీ సీఈఓ నిదియా దేవి, డీఆర్వో రామకృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బుకొఠారి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము స్వాహా

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు



సచివాలయ సిబ్బందికి శనివారం పింఛన్ సొమ్ము అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున (కింద కూర్చున్న వ్యక్తి)

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 2: శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున పింఛన్ల సొమ్ము పంపిణీ చేయకుండా చేతివాటం ప్రదర్శించాడు. లబ్ధిదారులతో సోమవారం వేలిముద్రలు వేయించుకుని.. సొమ్ము ఇవ్వకుండా వెళ్లిపోయాడు. మొత్తం రూ.8 లక్షల వరకూ కాజేశాడని బాధితులు ఎంపీడీఓ నరసింహమూర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీఓ ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ కూటమి మంజూరు చేసిన కొత్త పింఛన్లను పంపిణీ చేసేందుకు బ్యాంకు నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ శనివారం రూ.42 లక్షలు డ్రా చేశాడు. అదే రోజు సచివాలయంలో పనిచేసే తొమ్మిది మంది ఉద్యోగులకు రూ.3 లక్షలు.. రూ.5 లక్షలు చొప్పున అందజేసి, పింఛన్లు పంపిణీ చేయమని సూచించాడు. తక్కువ వస్తే తనను అడగాలని చెప్పి వెళ్లిపోయాడు. తన వంతుగా పంపిణీ చేయాల్సిన సొమ్మును మాత్రం స్వాహా చేశాడు. సుమారు 50 మంది లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని, డబ్బులు తరువాత ఇస్తానని చెప్పినట్లు బాధితులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనూ మల్లికార్జున పింఛన్లను స్వాహా చేశాడని, అప్పట్లో వైసీపీ నాయకులు దుప్పటి పంచాయితీ చేసి అతన్ని కాపాడారని ఆరోపణలు ఉన్నాయి.

అనంత అక్రమార్కుడు

రిటైర్డ్ ఏఎస్పీ బాలనరసింహారెడ్డి

అనంతపురం క్రైం, జూలై 2: మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ బాలనరసింహారెడ్డి నగరపాలిక కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. నగరంలో రోడ్ల విస్తరణ పేరిట రూ.35 కోట్లు ముడుపులు తీసుకున్నారని, అక్రమ నిర్మాణాల పేరుతో ఎన్నో ఇళ్లు కూల్చివేయించారని పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వలేదన్న అక్కసుతో తన ఇంటిని కూడా కూల్చి వేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఐటీఐ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంత ఇంటిపై నాలుగు వేల చదరపు అడుగులు షెడ్డు, ఇంటి ముందు ఐదు వేల చదరపు అడుగుల షెడ్డు నిర్మించారని, వీటికి ఎలాంటి అనుమతులు లేవని పేర్కొన్నారు. నగరపాలికకు పన్ను కూడా ఎగవేశారని పేర్కొన్నారు. నగరపాలిక అధికారులను బెదిరించి, అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కోతులు, కుక్కలు, పందులు పట్టి తరలించే పేరిట రూ.లక్షల్లో అవినీతికి పాల్పడ్డారని, డంపింగ్ యార్డులో రూ.23 కోట్లు డిజిటల్ ట్రాన్స్‌ఫర్లు చేయించుకుని దిగమింగారని ఆరోపించారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, ఇకనైనా మాజీ ఎమ్మెల్యే అనంత పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

పదేళ్ల పనిమంతుడు..!

పైసలివ్వనిదే ఫైల్ ముట్టుకోడు

అటవీశాఖలో ఓ అధికారి దందా



అటవీశాఖ జిల్లా కార్యాలయం



అనంతపురం న్యూటౌన్, జూలై 2: అటవీశాఖ జిల్లా కార్యాలయంలో పదేళ్లుగా ఓ అధికారి పాతుకుపోయారు. ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి అండతో వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేసి మరీ దందా నడిపిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ముడుపు కడితేగానీ ఫైల్ ముందుకు కదలదని, చెదలు పట్టినా అలాగే ఉండిపోతుందని విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లు.. ఇలా ఏదైనా సరే.. ఆయనకు ఇవ్వాల్సింది ఇచ్చేయాల్సిందేనట. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక బాధితులు లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అటవీశాఖ జిల్లా కార్యాలయం పరిపాలన విభాగం దుస్థితి ఇది. గుమాస్తా హోదాలో ఉన్న ఆయన.. పదేళ్లుగా ఒకే సీటుకు అతుక్కుపోయారు. పరిపాలన విభాగంలో ఆయనే కీలకం. ప్రతి ఫైల్ ఇయన వద్దకు వెళ్లాల్సిందే. కార్యాలయంలో సూపరింటెండెంట్ ఉన్నా లేనట్లేనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైల్స్ అన్నీ ఆయన టేబుల్ దాటుకునే వెళ్లాల్సి ఉన్నందున.. ఆ సీటు హాట్ కేక్‌లా తయారైందని అంటున్నారు. మరీముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అటవీశాఖ ఉద్యోగుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల ఫైళ్లు ఆయన చేతుల్లోనే ఉంటాయని అంటున్నారు.

కదలని ఉద్యోగోన్నతుల ఫైల్

ముడుపు కట్టిన వారికి ఆయన ప్రాధాన్యం ఇస్తారని, మిగిలినవారి గురించి పట్టించుకోరని సమాచారం. ఇటీవల ఎఫ్ఎస్ఓకు డీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఖాళీ అయిన స్థానాలకు ఎఫ్‌బీఓలలో అర్హులను గుర్తించి.. ఎఫ్ఎస్ఓలుగా ఉద్యోగోన్నతి కల్పించడానికి ఫైల్స్ సిద్ధం చేసి.. ఉన్నతాధికారుల అనుమతికి పంపాలి. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఫెవికాల్ వీరుడికి ముడుపుల బేరం కుదరక.. ఫైల్ ఉన్నతాధికారులకు పంపడం లేదని అంటున్నారు. తమకు అర్హత ఉందని, ఉద్యోగోన్నతి ఎలా రాకుండా పోతుందో చూస్తామని కొందరు మొండికేయడంతో కాలయాపన జరుగుతోందని అంటున్నారు. తమకు కాదని, ముడుపులతో అడ్డదారిలో ఉద్యోగోన్నతులకు జాబితా తయారు చేస్తే ఉన్నతాధికారులను సంప్రదిస్తామని అర్హులు అంటున్నారు.

ఆపరేషన్ టార్చ్‌లైట్

అనంతపురం నగరంలోని జిల్లా సర్వజన వైద్యశాల క్యాజువాలిటీ పరిస్థితి నరకప్రాయంగా మారింది. అత్యవసర కేసులు నేరుగా ఇక్కడికి వచ్చి.. చికిత్స పొందిన తరువాత ఆయా విభాగాలకు పంపుతారు. ఇక్కడ రద్దీకి సరిపడా పడకలు లేవు. ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేవు. సహాయకులు కనిపించరు. రోగుల వెంట వచ్చిన కుటుంబ సభ్యులు, ఆప్తులు వారిని భుజాలపై ఎత్తుకుని వెళ్లాల్సిందే. పొరపాటున ఏదైనా వీల్‌చైర్ కనిపిస్తే.. దాన్నీ వారే తీసుకుని తోసుకువెళ్లాల్సిందే. ఇక వైద్యులు, సిబ్బంది పరిస్థితి మరీ ఘోరం..! ఫ్యాన్‌ల సంగతి అటుంచితే.. లైట్లు వెలగడం లేదు. చీకట్లో అత్యవసర వైద్యం చేయడం కోసం తమ సెల్‌ఫోన్ టార్చ్‌లైట్లను వాడుతున్నారు. కొన్నేళ్ల నుంచి ఇదే దారిద్ర్యం..! కొత్త ప్రభుత్వం, కొత్త ప్రజా ప్రతినిధులు చొరవ చూపి.. బాధితులకు నరకం తప్పించాల్సిన అవసరం ఉంది. -

- అనంతపురం టౌన్



నరకం ఎక్కడో ఉండదు.. అనంత సర్వజన వైద్యశాల ఆవరణలో అడుగు పెడితే చాలు.. ఇదిగో.. ఇలా కనిపిస్తుంది



సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో వైద్యం.. ఇంతకన్నా దారుణం ఉంటుందా..?





ఆత్మఘోష

బెంగళూరుకు చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మృతిచెందారు. రాత్రి 11 గంటలు దాటినా అతని మృతదేహాన్ని అత్యవసర విభాగం బెడ్‌పైనే ఉంచారు. ఇద్దరు అతిసార బాధిత యువకులు ఆ మృతదేహం ఉన్న బెడ్‌పైనే కూర్చుని చికిత్స చేయించుకున్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి అవార్డు


వీరస్వామి

కదిరి అర్బన్, జూలై 2: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ వేమల వీరాస్వామికి జ్యువెల్ ఆఫ్ ఇండియా అవార్డు దక్కింది. న్యూఢిల్లీకి చెందిన కేటీకే ఫౌండేషన్ దేశంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వ్యక్తులను ఈ అవార్డులతో సత్కరిస్తోంది. ఆ సంస్థ కొరియర్ ద్వారా పంపిన ఆ అవార్డును తాను మంగళవారం అందుకున్నట్లు వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

తుంగభద్రకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూలై 2: తుంగభద్ర జలాశయంలోకి ఇన్‌ఫ్లో రోజు రోజుకు పెరుగుతోంది. జలాశయంలోకి మంగళవారం 13,410 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రస్తుతం జలాశయంలో 1585.87 అడుగుల నీటిమట్టం ఉండగా 7.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్ ఫ్లో 297 క్యూసెక్కులు ఉంది. దీంతో బొమ్మనహాళ్, కణేకల్లు ప్రాంతాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర జలాశయంపై ఆధారపడిన రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ యాప్ నుంచే బిల్లులు చెల్లించండి

అనంతపురం రూరల్, జూలై 2: విద్యుత్ బిల్లులను ఇక నుంచి ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా చెల్లించాలని విద్యుత్ శాఖ టెక్నికల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఆ మేరకు సంస్థ నుంచి ఈనెల 1వతేదీన ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లలో ఏపీఎస్పీడీఎల్ డిస్కమ్ పేరు కనిపించదన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని లేదంటే డిస్కం వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సంస్థ వెబ్ సైట్ నందు బిల్లులు చెల్లించేటప్పుడు బిల్‌డెస్క్‌లో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్ వాడవచ్చున్నారు. అలాగే డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాకింగ్, వాలెట్, క్యాష్‌కార్డులను కూడా వాడవచ్చన్నారు.

సైనిక శిబిరం ఎంపికకు శిక్షణ


మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి

కూడేరు, జూలై 2: ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ శిబిరానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కమాండర్ కల్నల్ రమేష్ పేర్కొన్నారు. మండలపరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి దాదాపు 520 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కల్నల్ రమేష్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాంపుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. తల్‌సైనిక్ క్యాంపులో శిక్షణ పొందిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

చేయూత దొరికేనా..?



- వైసీపీ పాలనలో నిర్వీర్యమైన సొసైటీలు
- రూ.కోట్లలో పేరుకుపోయిన ఎన్‌పీఏలు
- సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితి
- హెచ్‌ఆర్ పాలసీ అమలులో తీవ్ర నిర్లక్ష్యం
- పంట రుణాలు ప్రారంభించని వైనం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2: వైసీపీ పాలనలో సొసైటీలు నిర్వీర్యమయ్యాయి. ప్రభుత్వం చేయూత కొరవడటంతో సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని స్థితికి చేరాయి. ఉమ్మడి జిల్లాలోని 115 సొసైటీల్లో సుమారు మూడు లక్షల మంది రైతులు ఖాతాదారులుగా ఉన్నారు. ఇప్పటివరకు రూ.600 ఔట్ స్టాండింగ్ రుణాలు, రూ.150కోట్ల వరకు ఎన్‌పీఏలు ఉన్నాయి. ప్రతి ఏటా జూన్ చివరి నాటికి రూ.600కోట్ల పంట రుణాలు రెన్యువల్ పూర్తి చేయాలి. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు పంటరుణాల రెన్యువల్ ప్రారంభించలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో కొన్నేళ్లుగా తిష్టవేసిన సీనియర్ అధికారుల ఆధిపత్యపోరు, సమన్వయలోపం సొసైటీలను నిర్వీర్యం చేస్తున్నాయి. రుణాలు చెల్లించకపోవడం, పంట రుణాలు రెన్యువల్ చేయకపోవడంతో సొసైటీల టర్నోవర్ పూర్తిగా పడిపోయింది. ఆర్‌బీకేల సాకుతో గత ఐదేళ్లగా సొసైటీల్లో ఎరువుల అమ్మకాలను నిలిపివేసిన ప్రభుత్వం వాటి ఆర్థిక పురోగతిని అడ్డుకుంది. మితిమీరిన రాజకీయ జోక్యం, ఇచ్చిన రుణాలు సక్రమంగా వసూలు కాకపోవడంతో సొసైటీలు మరింత నష్టాల్లో కూరుకుపోయాయి.


ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఏడాదిగా అందని జీతాలు

గత ఏడాది నుంచి సొసైటీల్లో పని చేసే సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితి ఉంది. జిల్లాలో సుమారు 115సొసైటీలు ఉండగా ఇందులో సుమారు 70సొసైటీలు నష్టాలలో కూరుకుపోయాయి. దీంతో ఉద్యోగులకు ఏడాదిగా వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయి. 2019లో టీడీపీ ప్రభుత్వం సొసైటీ ఉద్యోగులకు జారీ చేసిన హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది. ఇది కూడా ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టింది.

తక్కువ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అమలు

ఇతర బ్యాంకులతో పోలిస్తే ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని సొసైటీల్లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తక్కువగా ఉండటంతో రైతులు సొసైటీలలో రుణాలు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. పొరుగు జిల్లాలు కర్నూలులో ఎకరానికి రూ.60వేలు, చిత్తూరులో 70వేలు చెల్లిస్తున్నారు. అయితే జిల్లాలో మాత్రం రూ.32వేలకు మించి ఎకరాకి రైతుకు పంట రుణాలు ఇవ్వడం లేదు. అంతేగాక ఆప్కాబ్ నుంచి వచ్చే షేర్ క్యాపిటల్ (లాభం)లో రైతులకు వాటా చెల్లించడం లేదు. ఇతర బ్యాంకులలో కనీసం ఎకరాకు రూ.40వేలకు పైగా చెల్లిస్తున్నారు. ఈనేపథ్యంలో సొసైటీల్లో రుణాలు తీసుకునే రైతుల సంఖ్య తగ్గింది. దీంతో సొసైటీల టర్నోవర్ కూడా తగ్గింది.


నష్టాల్లో కూరుకుపోయిన కూడేరు సొసైటీ

రుణాలు ఇవ్వరు.. రెన్యువల్ చేయరు..

గత ఏడాది రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో సొసైటీలు నిర్లక్ష్యం వహించాయి. నాబార్డు, ఆప్కాబ్‌ల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ పంట రుణాలు ఇవ్వలేదంటే గత ప్రభుత్వ పాలకులకు రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. నాబార్డు, ఆప్కాబ్‌లు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని నిధులు ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. ఏడీసీసీ బ్యాంకులో పనిచేస్తున్న అధికారుల నిర్వాకం, సవాలక్ష అంక్షలు, ముడుపులు ఇవ్వలేదనే అక్కసుతో రైతులకు పంట రుణాలు మంజూరు చేయడం లేదనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి: హరికృష్ణ, ఆంజనేయులు, సొసైటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు



గత ఐదేళ్లగా సొసైటీలకు ఇవ్వాల్సిన రాయితీలను ప్రభుత్వం నిలిపివేసింది. మొత్తం లాభంలో సొసైటీలకు ఇవ్వడం లేదు. ఐదేళ్లకు రూ.53కోట్లు రావాల్సి ఉండగా రూ.రెండు కోట్లు మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.51కోట్లు ఎక్కడికి వెళ్లింది? ఎవరు తిన్నారనే అంశంపై విచారణ జరిపించాలి. సొసైటీ ఉద్యోగులకు ఏడాదిగా వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగుల కుటుంబాలు ఎలా బతకాలి. సొసైటీలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపించి, సక్రమంగా రైతులకు పంట రుణాలు, రెన్యువల్ చేయాలి అప్పుడే టర్నోవర్ పెరుగుతుంది. సొసైటీలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలో పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. మితిమీరిన రాజకీయ జోక్యం తగ్గించాలి.

సొసైటీలను అభివృద్ధి చేస్తాం: సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ



గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎంతో ఉపయోగపడే సొసైటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇదివరకు సొసైటీలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమే. ఇందుకు సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యం కావడం ఒక కారణం. కంప్యూటరీకరణ పూర్తయితే రుణాల చెల్లింపుల్లో పారదర్శకత, నిర్వహణలో స్పష్టత వస్తుంది. రుణాల చెల్లింపులు, రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇందుకు బ్యాంకు, సొసైటీల సిబ్బంది సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించాం. కలిసి పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయి. రుణాల చెల్లింపులు, పంట రుణాల రెన్యువల్ వేగవంతం చేయాల్సిన పరిస్థితి. సొసైటీలకు రుణాలతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలను చూపాలి.

రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకరిస్తాం

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి


మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర టౌన్, జూలై 2: రాష్ట్రంలో రెండు పార్టీలు కేంద్రానికి మద్దతు ఇస్తున్నాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడితే తాము కూడా సహకరిస్తామని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మడకశిరలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు బీజేపీకి లేకపోతే కేంద్రంలో ఏం జరుగుతుందో చెప్పలేమని అన్నారు. వీరి మద్దతుతోనే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతోందని అన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని కాపాడటానికి బలమైన ప్రతిపక్షం ఉందని అన్నారు. ఈనెల 6న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు హైదరాబాద్‌లో సమావేశం కానున్నారని, ఆంధ్రప్రదేశ్ హక్కులను సాధించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇదేమంచి తరుణమని అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు ఆయన శుభకాంక్షలు తెలిపారు. మడకశిరలో ఆగిన రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేయించాలనీ, హంద్రీనీవా కాలువ ద్వారా అన్ని చెరువులకు నీరు నింపాలని వారికి సూచించారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా అందరి గొంతులు తడపాలని, పరిశ్రమల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఉసురు తీసిన వైసీపీ ప్రభుత్వం


మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 2: స్వయం ప్రతిపత్తిగల విశ్వవిద్యాలయాల్లో అరాచకశక్తులను జొప్పించిన గత ప్రభుత్వం.. ఐదేళ్లపాటు ఉద్యోగుల ఉసురు తీసుకుందని రాష్ట్ర వర్సిటీల బోధనేతర ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఆవేదనచెందారు. మంగళవారం వారు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో కలిసి తమ హక్కుల ను పరిరక్షించాలని కోరినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు కేశవరెడ్డితితో కలిసి మంత్రికి సమస్యలు వివరించామని మాజీ అధ్యక్షుడు తిమ్మప్ప పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఊపిరి పీల్చుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వర్సిటీల ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును 2022 జనవరి 1నుంచే అమలు చేయాలన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగులు నిశ్చింతంగా విధులు నిర్వహించుకోవచ్చునని, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చారని తెలిపారు.

కార్మిక వ్యతిరేకతతోనే వైసీపీ ఓటమి

ఓబుళదేవరచెరువు, జూలై 2: గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను ఇబ్బంది పెట్టడం వల్లే ఓటమి పాలైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మహమ్మదా బాద్ క్రాస్‌లో విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ- వైసీపీ ప్రభుత్వం మాదిరి ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వం తప్పులు చేయరాదన్నారు. పలు ప్రాంతాల్లో ఆశ, అంగన్ వాడీ, మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులను వైదొలగాలని ఒత్తిళ్ల తేవడం సరైంది కాదన్నారు. సమాన పనికి సమాన వేతనం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై పోలీసుల వేధిపులు, చలానాలు రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్, వేమన, బాబా, మండలాధ్యకార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఓబులు

చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురంరూరల్, జూలై 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 338 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

ప్రవేశాలకు వేళాయె..!



- డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభం
- డిగ్రీకి ఈనెల 10వరకు, ఇంజనీరింగ్‌కు 7వరకు రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్, జూలై 2: ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకామ్, బీబీఏ, ఒకేషనల్ వంటి కోర్సులతోపాటు ఇంజనీరింగ్‌లో బీటెక్ కోర్సుల ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టింది. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 1 నుంచి 7వ తేదీవరకు, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు 10వరకు ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశాల ప్రక్రియను ప్రతిఏటా ఆలస్యంగా చేపట్టింది. దీంతో తరగతుల నిర్వహణ కాలపరిమితి కుదించి పరీక్షలు నిర్వహించేవారు. అయితే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల తిరగక ముందే కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టడంపై హర్షం వ్యక్తం అవుతోంది.

ఇంజనీరింగ్‌లో...

జేఎన్‌టీయూ పరిధిలో 120కిపైగా అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. అనంతపురం, పులివెందుల, కలికిరి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఈఏపీసెట్ (ఎంపీసీ స్ట్రీమింగ్)లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల ఏడో తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అధికారులు పరిశీలిస్తారు. లోపాలుంటే సంబంధిత విద్యార్థుల మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు పంపుతారు. 8నుంచి 12 తేదీవరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. ఆప్షన్లు ఇచ్చుకున్న కళాశాలలను 13న మార్పు(స్లైడింగ్) చేసుకునే వెసులు బాటును కల్పించారు. అనంతరం 16న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో 22లోపు రిపోర్ట్ చేసుకోవాలి. 19నుం చి కళాశాలల తరగతులు ప్రారంభం కానున్నాయి. https://eapcetsche.aptonline.in/EAPCET/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సమస్యల పరిష్కారాలకోసం జేఎన్‌టీయూ హె ల్ప్ లైన్ సెంటర్ 08554-272450, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ 7901620145 నెంబర్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలలోపు సంప్రదించాలని అధికారులు సూచించారు.

డిగ్రీ ప్రవేశాలకు...

ఎస్కేయూ పరిధిలో 13 ప్రభుత్వ, 74 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల పదో తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ నెల ఐదో తేదీ నుంచే పరిశీలిస్తారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు 11నుంచి 15వరకు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలల ఎంపిక చేసుకోవాలి. ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి 19న సీట్లను కేటాయిస్తారు. సీటుపొందిన విద్యార్థులు 20 నుంచి 22వరకు సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం తరగతులు ప్రారంభం కానున్నాయి. https://oamdcapsche.aptonline.in/OAMDC202425/Inde వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు ఆర్ట్స్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ 8897841984 నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి సూచించారు.

ఉచితంగా రిజిస్ట్రేషన్

డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కేటగిరి వారిగా ఓసీ రూ.400, బీసీ రూ.300, ఎస్సీఎస్టీ రూ.200ల చొప్పున ఆన్‌లైన్ ద్వారానే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేట్ ఇంటర్నెట్ సెంటర్లలోకి వెళితే వీటికి అదనంగా ఒక్కక్కరికి దాదాపు రూ.300వరకు వసూలు చేస్తారు. ఈ అదనపు భారంలేకుండా ఆర్ట్స్ కళాశాలలోనే విద్యార్థులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

చెస్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విజేతలుగా జిల్లా క్రీడాకారులు నిలిచారు. రెండు రోజులుగా కర్నూలులో నిర్వహించిన 4వ స్పార్క్ చెస్ అకాడమీ ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఉదయ్‌కుమార్ రన్నరప్ టైటిల్ కైవసం చేసుకోగా, ఏ1 చెస్ అకాడమీకి చెందిన నితీష్ నాలుగోస్థానం, శ్రీహ పదోస్థానం, అండర్-7 బాలికల విభాగంలో షేక్‌ఆసిఆలీ ప్రథమ స్థానాన్ని, అండర్-13లో కాశి నౌమిక మొదటి స్థానాన్ని సాధించారు. ఈనెల 12వతేదీ నుంచి విజయవాడలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

బాలికపై అత్యాచారం

ఇద్దరిపై పోక్సో కేసు

పుట్లూరు, జూలై 2: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రవితేజ, నాగేంద్ర అనే ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ హేమాద్రి మంగళవారం తెలిపారు. బాలికను స్వగ్రామం నుంచి నిందితులు ఇద్దరూ సోమవారం బైక్‌పై తాడిపత్రి మార్కెట్‌యార్డుకు తీసుకువెళ్లి.. ఐచర్ వాహనంలోకి ఎక్కించి అత్యాచారం చేశారని అన్నారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, జూలై 2: పెండింగ్‌లోని కోర్టు కేసులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం రెవెన్యూ, లీగల్ అంశాలపై ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కోర్టు కేసులను రోజుకు ఒకటి చొప్పున వెంటనే క్లియర్ చేయాలన్నారు. కంటెంప్ట్ కేసులను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, రాణి సుస్మిత, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేటిలోగా ఎన్నికల లెక్కలు చూపాలి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖర్చు తుది అకౌంట్స్ వివరాలను బుధవారంలోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ షిండే, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్, అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు రాందాస్ కాలేలతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులందరూ ఎన్నికల అంతిమ లెక్కలను డీఈఓకు సమర్పించాలని, లేనిపక్షంలో డిస్ క్వాలిఫై అవుతారన్నారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, పర్యాటక శాఖ ఆర్‌డీ వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల ఖర్చు మానిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్‌లో 946 మంది ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూలై 2: ఏపీ ఓపెన్ స్కూల్-2024 పరీక్షల్లో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో 1337 మందిలో 946 మంది ఉత్తీర్ణులైనట్టు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో 409 మందిలో 291 మంది ఉత్తీర్ణులు కాగా 71.15 శాతం ఉత్తీర్ణత వచ్చిందని, ఇంటర్‌లో 928 మందిలో 655 మంది పాస్ కాగా 70.58 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. అనంతపురం జిల్లాకు రాష్ట్రంలో 13వ స్థానం దక్కిందని తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు అభ్యర్థులు రూ. 200, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెల 13వ తేదీ వరకూ ఫీజును మీసేవ లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో లేదా ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్ వెబ్‌సైట్‌లో ఇచ్చిన గేట్ వే లింకు ద్వారానే చెల్లించాలన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ జేడీ బదిలీ?

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 2: ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావును బదిలీ చేస్తూ ఆశాఖ రాష్ట్ర అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఇదివరకు ఆయన రాష్ట్ర కార్యాలయంలోని స్కాలర్‌షిప్ విభాగంలో విశిష్ట సేవలు అందించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో స్కాలర్‌షిప్‌లను జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పేరిట బ్యాంకు ఖాతాల్లోకి జమచేయడంతో ఆ విభాగం ఖాళీ అయినట్లయింది. స్కాలర్‌షిప్పులను గతంలో మాదిరిగానే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జేడీ మధుసూదన్ రావుకు తిరిగి స్కాలర్‌షిప్పుల విభాగానికి రావాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఆయనను రాష్ట్రశాఖలోని స్కాలర్‌షిప్‌ల విభాగానికి బదిలీ చేసినట్లు ఆశాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు నేడో.. రేపో.. వెలువడనున్నట్లు తెలిసింది.

వైద్యులకూ క్రీడలు అవసరం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 2: విధి నిర్వహణలో వైద్యులకు మానసిక ఒత్తిడి మరింత అధికంగా ఉంటుందని, దానిని అధిగమించేందుకు క్రీడలు అవసరమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పీటీసీ మైదానంలో వికసిత్ భారత్ స్పోర్ట్స్ ఫెస్ట్ - 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ క్రీడలు నెల రోజులపాటు జరగనున్నాయని, రాష్ట్రస్థాయిలో ఆడేందుకు అనంతపురం ప్రభుత్వాస్పత్రి నుంచి ఒక జట్టును సిద్ధం చేయాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్లు ప్రవీణ్, వదరరాజులు, శంకర్‌నారాయణ, సునీత, రజిత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'గురుపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయండి'



గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కార్యవర్గం

అనంతపురం కల్చరల్, జూలై 2: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మూడవరోడ్డులోని షిర్డిసాయి మందిరంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం జయచంద్రచౌదరి కోరారు. మంగళవారం ఆలయ ఆవరణలో గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న నగరంలో సాయి భిక్షాటన కార్యక్రమం, 19 నుంచి 21వ తేదీ వరకు విశేష పూజాకార్యక్రమాలు, నగరోత్సవ సేవలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శివానందం, ఉపాధ్యక్షులు గంగిరెడ్డి, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రఘురామరావు, కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, ఉపకార్యదర్శులు నాగేంద్రప్రసాద్, శశిధర్, కోశాధికారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంపిణీ



చిరుధాన్యాలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రామగిరి, జూలై 2: మండలంలోని సీ కొత్తపల్లి, కంబదూరు మండలాలకు చెందిన చెన్నంపల్లి గ్రామాల్లోని రైతులకు మంగళవారం చర, పాస్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా చిరుధాన్యాలు పంపిణీ చేశాయి. ఈ సందర్భంగా ఆ స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తులను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కార్యక్రమం చేపట్టామన్నారు. రైతులను ఈ ఉత్పత్తులు సాగుచేసేలా చైతన్యపరుస్తున్నామన్నారు. ఈనెల 8న పేరూరు, కంబదూరు మండలాల్లో డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో చర, పాస్ స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు స్వామి, రామప్ప పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 50 గొర్రెపిల్లల మృతి

నార్పల, జూలై 2: మండలంలోని దుర్గం గ్రామంలో సోమవారం రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడిచేయడంతో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గొర్రెల కాపర్లు సోము, చంద్రశేఖర్, వెంకటరమణప్ప గ్రామ సమీపంలోని కొండల వైపు గొర్రెలను తీసుకెళ్లారు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని కాపర్లు వాపోయారు. పశువైద్యాధికారులు మృతి చెందిన గొర్రె పిల్లలను పరిశీలించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు దృష్టికి గొర్రెల కాపర్లు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే అధికారులతో మాట్లాడి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. గొర్రెల కాపర్లకు ఆర్థిక సాయం అందేలా చేస్తామని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వ హామీలను నెరవేర్చండి

మున్సిపల్ శాఖ మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 2: గత ప్రభుత్వ హామీలను జీవోల రూపంలో వెంటనే నెరవేర్చాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ కోరారు. మంగళవారం విజయవాడలో మునిసిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డిమాండ్ల సాధన కోసం 16 రోజులపాటు నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. ఆ నేపథ్యంలో ఎన్నికల అనంతరం డిమాండ్లను పరిష్కరిస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. దీంతో సమ్మెను విరమించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ఈ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వారికి పింఛన్

అనంతపురంరూరల్, జూలై 2: మండలంలోని రాచానపల్లికి చెందిన టీడీపీ నాయకులు మంగళవారం నగరంలోని సాయినగర్‌లో ఉన్న పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో మంజునాథ్, బిల్లానాగరాజు, బుల్లెట్ రఫీ, పుత్తఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో ఉజ్జినప్పకు పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజల రుణం తీర్చుకుంటాం

● విజయోత్సవ ర్యాలీలో మంత్రి సవిత, ఎంపీ బీకే, ఎమ్మెల్యే పరిటాల సునీత



ర్యాలీలో పాల్గొన్న సవిత, బీకే, పరిటాల సునీత



పరిటాల సునీత, శ్రీరామ్‌కు గజమాలతో సత్కారం

ధర్మవరం రూరల్ (కనగానపల్లి), జూలై 2: అరాచక పాలనను అంతమొందించి ప్రజాపాలనకు కృషిచేసిన ప్రజలందరి రుణం తీర్చుకుంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకేపార్థసారధి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత పేర్కొన్నారు. మండలంలోని తగరకుంటలో మంగళవారం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లగా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజల సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఇచ్చిన మాట మేరకు పింఛన్ అందించామన్నారు. రాప్తాడులో అభివృద్ధిపై దృష్టిసారిస్తామన్నారు. తాగు, సాగు నీటితోపాటు ముఖ్యంగా పేరూరు డ్యాంకు నీటిని తీసుకురావడానికి కృషిచేస్తామన్నారు.

కార్యకర్తలకు న్యాయం చేస్తాం : పరిటాల శ్రీరామ్

జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని పరిటాల శ్రీరామ్ అన్నారు. విజయోత్సవ ర్యాలీకి హాజరైన ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు తప్పక న్యాయం చేస్తామన్నారు. అనంతరం పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లను గ్రామస్థులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, సుధాకర్‌చౌదరి, బోధులస్వాతి, సర్పంచ్ మాధవరాజు, రామాంజి, యాతంపోతలయ్య, బత్రాసురేశ్‌చౌదరి, రాజాక్రిష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో పలుజట్ల విజయం



రిషిక



మెహికా



శ్రీష్టిషికార్



నేహా

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. మంగళవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీలు జరిగాయి. విశాఖపట్నం, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం 47.4ఓవర్లలో 206 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. శ్రీష్టి షికార్ 67పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు 38.3ఓవర్లలో 133పరుగులకు ఆలౌట్ అయ్యింది. మరో పోటీలో అనంతపురం, కృష్ణ జట్లు తలపడ్డాయి. అనంతపురం జట్టు నిర్ణీత 50ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణ జట్టు 29 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 160పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో మెహికా 53 పరుగులు చేసి, 3 వికెట్లు తీసి ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. మరోమ్యాచ్‌లో సెంట్రల్ జోన్, నార్త్‌జోన్ జట్లు తలపడగా సెంట్రల్‌జోన్ 49.1ఓవర్లలో 227పరుగులకు ఆలౌటైంది. అనంతరం బరిలోకి దిగిన నార్త్‌జోన్ 32.1ఓవర్లలో 106 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సెంట్రల్ జోన్ బౌలర్ రిషిక 5 వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి పాల్గొన్నారు.

ఖర్చు కొండంత... రికవరీ గోరంత..

గార్లదిన్నె, జూలై 2: నామమాత్రంగా సామాజిక తనిఖీ జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఖర్చు కొండంత చూపించి రికవరీ మాత్రం గోరంత చూపారన్న ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా ఏడాదిపాటు నిర్వహించిన పనులపై మండలంలోని సామాజిక తనిఖీని ఇటీవల నిర్వహించారు. ఈ పనులకు సుమారు రూ. 11.69 కోట్లు వెచ్చించారు. అయితే తనిఖీలో మాత్రం రూ.19, 326 దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. ఈ సామాజిక తనిఖీకే సుమారు రూ. లక్ష వరకు వెచ్చించారు. ఈ తనిఖీకి అయినంత ఖర్చును కూడా రికవరీకి చూపకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. సామాజిక తనిఖీ బృందం అధికారులు పదిరోజుల నుంచి మండలవ్యాప్తంగా విచారణ జరిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విజిలెన్స్ అధికారి రమణరెడ్డి, ప్రెసిడింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, అంబుడ్స్ మధుసుదన్, ఏపీడీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటలక్ష్మితోపాటు ఏపీఓలు పాల్గొన్నారు. వివిధ పనుల్లో రూ. 19326 దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. అయితే నామమాత్రంగా తనిఖీలు చేశారంటూ మండలంలో చర్చించుకుంటున్నారు.

నగరవనాల అభివృద్ధి వేగవంతం చేయాలి..

ఏపీసీసీఎఫ్ ఆర్కే సుమన్

అనంతపురం న్యూటౌన్, జూలై 2: నగరవనాల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఏపీసీసీఎఫ్ ఆర్కే సుమన్ ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు మంగళవారం పంపనూరు వద్ద ఉన్న నగరవనంలో స్థానిక సిబ్బంది ఏర్పాటు చేసిన మొక్కలునాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ మొక్కలు నాటిన అనంతరం ఆ ప్రాంతంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సీసీఎఫ్, డీఎఫ్ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి గుండ్లపల్లి నర్సరీని సందర్శించారు. అనంతరం కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన నగరవనాన్ని పరిశీలించారు. అక్కడ నాటడానికి ఉంచిన మొక్కలను చూసి సిబ్బందిని అభినందించారు. ఇదే తరహాలో అన్ని ప్రాంతాల్లో మొక్కలను పెంచాలని, తద్వారా వీలైనంతత్వరగా ఆహ్లాదవాతావరణాన్ని పొందగలమని అన్నారు. నిధుల కేటాయింపులకు అనుగుణంగా నగరవనాల అభివృద్ధి వేగవంతం చేయాలని సూచించారు. నగరవనాల ఏర్పాటులో భాగంగా ఎత్తైన మొక్కలను నాటేందుకు ఏర్పాటు చేసిన డీఎఫ్ఓ వినీత్‌కుమార్, రేంజర్ మధుబాబును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ నాగేశ్వరరావు, రేంజర్ శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఓ ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌బీఓ దామోదర్, ఏబీఓ రామ్మోహన్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



పంపనూరు నగరవనంలో మొక్కలు నాడుతున్న సుమన్

అవగాహన తప్పనిసరి..

అనంతపురం న్యూటౌన్, జూలై 2: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక శాఖాధికారి లింగమయ్య సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ట్రైనీ ఎస్ఐలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎలాంటి ప్రమాదాలను ఏవిధంగా ఎదుర్కోవాలి..? అన్న అంశంపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ట్రైనీ ఎస్ఐలకు అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తులు సమయంలో ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలి..? తదితర అంశాలను వివరించారు.

పింఛన్ల పెంపు హర్షణీయం

నార్పల, జూలై 2: పింఛన్ల పెంపు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. నార్పల అంబేడ్కర్ విగ్రహం కూడలిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై2: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఉచిత విద్యను కొనసాగించాలని కోరారు. కొడిమి జర్నలిస్టు కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, జిల్లా గౌరవాధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి అయూఫ్ బాషా ఉన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

చెన్నేకొత్తపల్లి, జూలై 2: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం అసిస్టెంట్ బీసీవెల్ఫేర్ అధికారి రాజ్‌కుళ్లాయప్ప తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా హాస్టల్‌లో ఉన్న సరుకులను, పరిసరాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. మెనూ మేరకు నాణ్యతతో భోజనాన్ని అందించాలని వార్డెన్ నారాయణస్వామికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

● మంత్రి సత్యకుమార్‌కు ఆపస్ వినతి

అనంతపురం విద్య, జూలై 2: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకులు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. మంగళవారం ధర్మవరంలో ఆ సంఘం నాయకులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...2003-డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్‌ను పరిష్కరించాలన్నారు. 3,4,5 క్లాసులను ఉన్నత పాఠశాలల నుంచి విలీనాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించి, అన్ని కేడర్ల టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ప్రతి ప్రైమరీ స్కూల్‌లో ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలన్నారు. భాషా పండితులకు పీఈటీలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని కోరారు. టీచర్లపై అనవసరమైన యాప్స్ భారం మోపకుండా చూడాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సలహాదారులు వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్రకార్యదర్శి రాజేంద్రప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షులు కళ్యాణి, ప్రధానకార్యదర్శి ఎర్రిస్వామి, కోశాధికారి రాఘవేంద్ర గుప్తా, ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ ఇతర నాయకులు నరహరి, దొనస్వామి, వరదరాజులు, రమేష్ పాల్గొన్నారు.



మంత్రికి వివేకానందుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆపస్ నాయకులు

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఐక్య విద్యార్థి సంఘాల పిలుపు

అనంతపురం కల్చరల్, జూలై 2: నీట్, నెట్ పరీక్షా పేపర్ల లీకేజీని నిరసిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం దేశవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుమల నరేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ఏఐఎస్ఏ నగర కార్యదర్శి బాలకృష్ణ, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, పిఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలం, విస్ఐవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకుడు భీమేష్‌లు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, అందులోనూ ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు సంబంధించిన వారే కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎన్‌టీఏ విడుదల చేసిన ఫలితాలపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, గిరి, భీమేష్, చందు, సూర్య, సోము, ఓబులేష్, ప్రతిభాభారతి, మంజునాథ్, చంద్ర, హర్ష, సునీల్ పాల్గొన్నారు.



ఐక్యత ప్రకటిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రేపు దేశవ్యాప్త బంద్: ఎన్ఎస్‌యూఐ

అనంతపురం న్యూటౌన్ : దేశవ్యాప్తబంద్‌ను గురువారం నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, నగరాధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మంజూనాథ్, మురళీకృష్ణ, తౌఫిక్, హర్ష, బాబా, ప్రభు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాల అందజేత



వెండి ఆభరణాలు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె, జూలై 2: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం భక్తులు రూ.25వేలు విలువ చేసే వెండి ఆభరణాలను అందజేశారు. నగరానికి చెందిన సూత్రం కృష్ణమూర్తి, కాసంశెట్టి బాల సుధీర్ వెండి యజ్ఞోపవీతాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులకు అందచేశారు.

నేడు సీకే పల్లికి ఎమ్మెల్యే సునీత రాక

చెన్నేకొత్తపల్లి, జూలై 2: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం చెన్నేకొత్తపల్లికి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంత్యుత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకానున్నారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

అనంతపురంరూరల్, జూలై 2: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలుప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్, బ్యాంకు కాలనీ, రుద్రంపేట బైపాస్, కొవ్వూరు నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

నార్పల, జూలై 2: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్ని నార్పల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనానాటి దానిని సంరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్యం నివారించడానికి మొక్కలు పెంపకం ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు జ్యోతి, లక్ష్మీరంగయ్య, వైపీ రంగారెడ్డి, వీరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

'పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలి'

శింగనమల, జూలై 2: జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కారర్యదర్శి తరిమెల భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో ఈ మేరకు ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎనిమిది నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుంకన్న రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

శింగనమల, జూలై 2: డయేరియాపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంగళవారం తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నారాలోకేశ్‌ను కలిసిన జకీవుల్లా



నారా లోకేశ్‌తో కేఎం జకీవుల్లా

అనంతపురం అర్బన్, జూలై 2: రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు కేఎం జకీవుల్లా, ఆయన తనయుడు కేఎం హర్షదుల్లా మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


తైక్వాండోలో జిల్లాకు రజత పతకం



తమన్‌సాయి

అనంతపురం క్లాక్ టవర్, జూలై 2: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు రజతపతకం దక్కింది. రెండు రోజులుగా విశాఖపట్నంలో నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి క్యాడెట్ తైక్వాండో పోటీ ల్లో నగరానికి చెందిన తమన్‌సాయి 45కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు.

పాండురంగస్వామి నిజపాద దర్శనం



ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి

అనంతపురం కల్చరల్, జూలై 2: జ్యేష్ఠ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల మూలవిరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతోపాటు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు ప్రజాసదస్సు

శింగనమల, జూలై 2: మండలంలో ఉపాధి పనులపై గురువారం బహిరంగ ప్రజా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ శ్రీదేవి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సదస్సు ఉంటుందన్నారు.

ఘనంగా యోగిని ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, విఠోబాస్వామి

పామిడి, జూలై 2 : పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి(తగ్గుదేవాలయం), రంగుసుబే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబాస్వామి దేవాలయాల్లో మంగళవారం యోగిని ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్లకు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వాములవారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. గోవింద నామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంచిపెట్టారు.

ఎమ్మెల్యే జేసీకి నోటీసు



ఎమ్మెల్యే ఇంటికి పోలీసులు అతికించిన నోటీసు

తాడిపత్రి, జూలై 2: పట్టణం విడిచి వెళ్లాలని టీడీపీ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసానికి మంగళవారం రాత్రి పోలీసులు నోటీసు అతికించారు. ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యేతోపాటు అయన తండ్రి టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలో ఉండరాదని కోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం విదితమే. కోర్టు ఆదేశాలను అనుసరిస్తూ ఎన్నికల్లో గెలిచినప్పటికి వారు అనంతపురంలోనే ఉంటున్నారు. రెండురోజుల కిందట ఎమ్మెల్యే మేనత్త సుజాత అనారోగ్యంతో మృతిచెందడంతో ఎమ్మెల్యేతోపాటు ఆయన తండ్రి పట్టణంలోని తమ నివాసానికి చేరుకున్నారు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత ఊరువిడిచి వెళ్లాలని పోలీసులు సూచించినప్పటికి మంగళవారం ఇరువురు ఇంటిలోనే ఉన్నారు. ఈ విషయం తెలుసుకొని పోలీసులు ఇంటికి నోటీసు అతికించారు. ఏమైందో తెలియదు కానీ అంటించిన కొద్ది క్షణాల్లోనే నోటీసును పోలీసులే తీసుకొని వెనక్కి వెళ్లిపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరుకు గాయాలు

గుత్తిరూరల్, జూలై 2 : మండలంలోని కొత్తపల్లి శివారులోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన డ్రైవర్ రసూల్ తాడిపత్రి నుంచి లారీ లోడుతో వెళ్తుండగా కొత్తపల్లి శివారులో ఆగి ఉన్న లారీని ఢీ కొంది. ఢీకొన్న లారీ డ్రైవర్ రసూల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఐగా రెడ్డెప్ప బాధ్యతల స్వీకరణ

పెద్దవడుగూరు, జూలై 2: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నూతన ఎస్‌ఐగా రెడ్డెప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు సెలవుపై వెళ్లడంతో రెడ్డెప్పను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్‌ఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దుకాణంలో చోరీ

గుత్తి, జూలై 2: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న వాసవి ఎలక్ట్రికల్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణానికి ఉన్న షట్టర్ తాళాలను పగులగొట్టి లోపల ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.10వేలు నగదు, విలువైన వస్తువులు అపహరించినట్లు బాధితుడు వెంకటరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనర్హులకు పింఛన్లు

బెళుగుప్ప, జూలై 2 : అనర్హులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేస్తున్నారని మండలంలోని కోనాపురం గ్రామస్థుడు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. మండలంలో పలువురు వయసులేకున్నా వృద్ధాప్య పింఛను, భర్త బతికున్నా లేనట్లు చూపించి వితంతు పింఛను, తప్పుడు ధృవపత్రాలతో వికలాంగ పింఛన్ పొందుతున్నారని ఆరోపించారు. కోనాపురంలో భర్త ఉన్నా రామక్క అనే మహిళ వితంతు పింఛను తీసుకుంటున్నట్లు ఫిర్యాదు చేశాడు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, జూలై 2: మండలంలోని బసినేపల్లి గ్రామాశివారులోని ఆదోని రహదారిపై మంగళవారం రాత్రి ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తాడిపత్రికి చెందిన ప్రతాప్, రంగా, రాజగోపాల్ ముగ్గురు నంద్యాల జిల్లా తుగ్గలి మండలం జోన్నగిరిలో వజ్రాల అన్వేషణ కోసం వెళ్లారు. తిరిగి ఆటో వస్తుండగా బసినేపల్లి శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

నేడు మెగా డీఎస్సీ శిక్షణ కేంద్రం ప్రారంభం

కళ్యాణదుర్గంరూరల్, జూలై 2 : ఎమ్మెల్యే సురేంద్ర బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డు హాల్ నెంబర్ ఒకటిలో మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని బుధవారం ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రారంభిస్తారు. ఈ సదావకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

భర్తే చంపాడని బంధువుల ఆరోపణ



నేత్ర (ఫైల్)

బొమ్మనహాళ్, జూలై 2: మండలంలోని రంగాపురం గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బొమ్మనహాళ్ పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా భోగనహళ్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ, తిప్పేస్వామి దంపతుల కుమార్తె నేత్ర(30). ఆమెను 2015లో బొమ్మనహాళ్ మండలం రంగాపురానికి చెందిన టీ వెంకటేశులు అనే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు. భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. తరచూ డబ్బు కోసం నేత్రను భర్త వెంకటేశులుతో పాటు అత్త లక్ష్మి, ఆడపడచు గాయత్రి వేధించేవా రని బంధువులు ఆరోపించారు. భర్తే సోమవారం కొట్టి చంపేసి ఆత్మహత్య చేసుకున్నట్లు తమకు సమాచారం ఇచ్చారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టంకి తరలించారు. కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు కోరారు.

కేరళవాసి మృతి

డీ.హీరేహాళ్, జూలై 2: కేరళ రాష్ట్రానికి చెందిన అబ్దుల్(60) అనే వ్యక్తి సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు బళ్లారి-బెంగళూరు హైవే వద్ద మృతి చెందినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. అతడు కొంతకాలంగా డీ హీరేహాళ్ సమీపలోని బళ్లారి-బెంగళూరు హైవే డాబాలో స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. అతడు సోమవారం రాత్రి పని ముగించుకుని వెళ్లాడని ధాబా వారు తెలిపారు. గంట సేపటికి హైవే పక్కనే అబ్దుల్ పడి ఉన్నట్లు స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారని ఎస్‌ఐ తెలిపారు. దీంతో సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతిచెంది ఉన్నాడన్నారు. మృతదేహాన్ని బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలోకి కాంగ్రెస్ నాయకుల చేరిక



టీడీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 2: మండలంలోని బోరంపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి కుమారుడు బీ మారెడ్డి, ఆర్మీ మాజీ జవాన్ రామాంజినేయరెడ్డి మంగళవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. స్థానిక ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు నాయకత్వం నచ్చడంతోనే టీడీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, పాపంపల్లి మల్లికార్జున, బోరంపల్లి నాయకులు సర్మస్, మారెప్ప, మల్లికార్జున, యర్రిస్వామి తదితరులు ఉన్నారు.

గండికోట నుంచి తాగునీరు అందించండి

పుట్లూరు, జూలై 2: కడపజిల్లా గండికోట డ్యాం నుంచి పుట్లూరు మండలానికి తాగు, సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు పుట్లూరు పుల్లారెడ్డి స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి విన్నవించారు. అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు రైతులతో మంగళవారం ఎమ్మెల్యేను కలిసి మాట్లాడినట్లు తెలిపారు. ప్రస్తుతానికి గండికోట నుంచి అరకొరగా తాగునీరు వస్తోందన్నారు. పూర్తిస్థాయిలో తాగు, సాగు నీరు అందించాలని కోరామన్నారు.

నేడు ఎమ్మెల్యే జేసీ పర్యటన

యాడికి, జూలై 2: ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం యాడికి మండలంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ రుద్రమనాయుడు తెలిపారు. గుడిపాడు, యాడికిలో పర్యటిస్తారని ఘనంగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నాగిరెడ్డిపల్లిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి



తాగునీటి కొళాయిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

రాయదుర్గంరూరల్, జూలై 2: మండలంలోని నాగిరెడ్డిపల్లిని జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి మంగళవారం సందర్శించారు. ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో వాంతులు, విరేచనాలతో మూడురోజులుగా దాదాపు 20 మంది వరకు ఆర్డీటీ ఆసుపత్రి, బళ్లారి విమ్స్ చికిత్సలు పొందుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణితోపాటు వైద్య సిబ్బంది గ్రామంలోని తాగునీటి ట్యాంకు, పైప్ లైన్ లీకేజీలపై గ్రామంలోని అన్ని వీధుల్లో పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీను శుభ్రపరచాలని, తాగునీటి ట్యాంక్‌ను బ్లీచింగ్‌తో శుభ్రం చేసి రోజూ క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు తగుసూచనలు ఇచ్చారు. గ్రామంలో వాంతులు, విరేచనాలు తగ్గుముఖం పట్టే వరకు హెల్త్ క్యాంప్ నిర్వహించాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుజాతకు ఆదేశాలు జారీ చేశారు. నాలుగురోజులుగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని, మంగళవారం కొత్తగా వాంతులు, విరేచనాల కేసులు నమోదు కాలేదని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రవి శంకర్, ఎపి డమిక్ సెల్ కో ఆర్డినేటర్ వేమారెడ్డి, ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు రాజేంద్ర ప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్ రామాంజినేయులు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కణేకల్లు: వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో ప్రబలే రోగాలను అరికట్టాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి పేర్కొన్నారు. ఆమె మంగళవారం మండలంలోని అంబాపురాన్ని సందర్శించి డయేరియాతో చనిపోయిన వంద్రప్ప కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులపై గ్రామ కార్యదర్శి చంద్రకళను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందితోపాటు పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని నేసేపేటను సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో యర్రగుంట్ల పీహెచ్‌సీ వైద్యులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ధర్నా

పోస్టుమార్టం చేయడంలో ఆలస్యంపై బాధితుల ఆగ్రహం



ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, జూలై 2: పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని ఆగ్రహిస్తూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి మంగళవారం ధర్నా చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు మాట్లాడుతూ కృష్ణవేణి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రాత్రి నుంచి దాదాపు వంద మంది మహిళలు, వృద్ధులు, గర్భవతులు, చిన్నపిల్లలతో బాలింతలు ఆస్పత్రి వద్దే ఉన్నామన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పోస్టుమార్టం చేస్తారని ఆసుపత్రి సిబ్బంది చెప్పారన్నారు. మధ్యాహ్నం 12గంటలైన పోస్టుమార్టం చేయకపోవడంతోనే ధర్నా చేసినట్లు తెలిపారు. 24 గంటలైన ఆసుపత్రిలో వైద్యులు స్పందించకపోవడం దారుణమన్నారు. సీపీఐ నాయకులు ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, తహసీల్దారును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతురాలి బంధువుల ధర్నాతో రోడ్డుపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచి పోయింది. టూటౌన్, వన్‌టౌన్, రూరల్ సీఐలు గణేష్, రామసుబ్బయ్య, మహేశ్వరరెడ్డి, రూరల్ ఎస్‌ఐ సురేష్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. ధర్నా విరమించాలని పోస్టుమార్టం త్వరగా చేయిస్తామని సీఐలు నచ్చచెప్పారు. టూటౌన్ సీఐ గణేష్ ఆసుపత్రి సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డిని పోస్టుమార్టం త్వరగా చేయాలని కోరారు. ఆలస్యంపై ఆసుపత్రి సూపరింటెండెంట్, తహసీల్దారు వివరణ ఇవ్వాలని బాధితులు భీష్మించారు. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డి ధర్నా వద్దకు వచ్చి ఆలస్యంపై వివరణ ఇచ్చారు. సీఐలు దగ్గర ఉండి పోస్టుమార్టం చేయించారు. దీంతో బంధువులు ధర్నా విరమించారు.

మొక్కలు నాటిన మున్సిపల్ కమిషనర్

గుంతకల్లుటౌన్, జూలై 2: పట్టణంలోని గుంతకుల్లు - గుత్తి రోడ్డులో తిమ్మాపురం వద్ద రోడ్డుకు ఇరువైపులా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్ప, ఏసీపీ సత్తార్, టీపీఆర్‌ఓ మోహన్, ఆర్‌ఐ ఎర్రిస్వామి, ఏఈ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో దోనిముక్కల రోడ్డులోని కస్తూర్బా విద్యాలయం వెనుక మొక్కలు నాటారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజినేయులు, నాయకులు గుర్రంసూర్యనారాయణ, విజయలక్ష్మి, సురేష్‌బాబు, కేశవ, కళావతి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు కుందుర్పి మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సజ్జల వెంకటేష్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన మొక్కలు నాటారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, కళ్యాణదుర్గం కో కన్వీనర్ గంగాధర, మండల ప్రధాన కార్యదర్శి వడ్డే కిష్టప్ప, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

విడపనకల్లు, జూలై 2: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలున వీ కొత్తకోట, విడపనకల్లు సర్పంచ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న బ్యాగులను, పుస్తకాలును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్‌బాబు, మండల ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచ్‌లు తిమ్మరాజు, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: టీడీపీ

పామిడి, జూలై 2: పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయమని తెలుగు తమ్ముళ్లు పేర్కొన్నారు. పట్టణంలోని 15, 16వ వార్డులలో మంగళవారం శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో డ్రైనేజీ, తాగునీరు సమస్యలను గుర్తించామన్నారు. గుర్తించిన ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు నివేదించి, పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నో ఏళ్లగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, వార్డు ఇంచార్జ్‌లు పత్రా శ్రీనివాసులు, కొట్టం మాలిక్‌బాషా, నాయకులు బొమ్మా మోహన్‌కృష్ణ, నల్లబోతుల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

యాడికి, జూలై 2: వ్యవసాయ తోటల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి వాటి లోని కాపర్, ఆయిల్‌ను చోరీచేశారు. మండలపరిధిలోని రాయలచెరువు వద్ద జాతీయ రహదారి పక్కన అదే గ్రామానికి చెందిన రంగారెడ్డి, ప్రకాష్‌రెడ్డికి వ్యవసాయ తోటలు ఉన్నాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న వ్యవసాయ తోటల్లో బోరు బావులు ఉండడంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లకు ఉన్న కరెంట్ కనెక్షన్ తొలగించి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. అందులోని కాపర్‌వైరును, ఆయిల్‌ను చోరీ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

తాడిపత్రి, జూలై 2: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో మంగళవారం పేకాడుతున్న 13మందిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.63వేలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామని, కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

నాటుసారా స్వాధీనం

యాడికి, జూలై 2: మండలంలోని లక్షుంపల్లిలో మంగళవారం ఎనిమిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. లక్షుంపల్లికి చెందిన ఓ వ్యక్తి నాటుసారా తయారుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం దాడిచేసి అతడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆసుపత్రి వద్దే పింఛన్ పంపిణీ



ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి రాఘవ

కూడేరు, జూలై 2 : మండలంలోని ఉదిరిపికొండ గ్రామానికి చెందిన నాగయ్య అనే వృద్ధుడు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో సచివాలయ ఉద్యోగి రాఘవ అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్మును అందించాడు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పింఛన్ పంపిణీని ఒకే రోజులో పూర్తి చేయాలని ఆదేశించడంతో... సచివాలయ ఉద్యోగి రాఘవ సోమవారం రాత్రి 9 గంటల సమయంలో గుండె సమస్యతో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగయ్యకు రూ. ఏడు వేలు అందజేశాడు. సచివాలయ ఉద్యోగితోపాటు టీడీపీ నాయకులు పొలా మహేష్, వీరుపాక్షి, వీరభద్ర, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో పింఛన్ అందిస్తున్న ఉద్యోగి

గుమ్మఘట్ట, జూలై 2: మండలంలోని గల గల గ్రామానికి చెందిన ఓ వృద్ధ మహిళ అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. తిప్పేస్వామి భార్య అయిన వృద్ధురాలు సరోజమ్మకు మంగళవారం సచివాలయ ఉద్యోగి మాంతేష్ సొంత ఖర్చులతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పింఛన్ అందించారు. దీంతో ఆ కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కర్ణాటకలోని శిరకు వెళ్లి పింఛన్ అందజేత

బ్రహ్మసముద్రం : మండలంలోని పాలవెంకటాపురం గ్రామ సచివాలయ సిబ్బంది అల్తాఫ్, సుధీర్ కుమార్ కర్ణాటకలోని శిరలో హాస్పిటల్ బెడ్‌పై ఉన్న లబ్ధిదారురాలు గొల్ల లక్ష్మక్కకు పింఛన్ అందజేశారు. వారు మంగళవారం శిర వెళ్లి పింఛన్ అందించారు.

1న జీతం వేయడంతో... అంగన్‌వాడీల హర్షం

కూడేరు, జూలై 2 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం సోమవారం 1వ తేదీనే వేతనాలు వేయడంతో అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో సమ్మె చేసిన అంగన్‌వాడీలకు టీడీపీ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల సమస్యలు తీరుస్తామని చెప్పిన మాట ప్రకారం వేతనాలు ఒకటో తేదీనే జమ చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

తాడిపత్రి, జూలై 2: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ-హిస్టరీ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ మ్యాథమేటిక్స్, బోటని కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 2నుంచి 10వరకు ఆన్‌లైన్‌లో పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9290500488, 9849777954 నెంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

బకాయిలు చెల్లించాలి

పెద్దవడుగూరు, జూలై 2: ఉపాధిహామి పథకం కింద పనులు చేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలీలను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ శేషరామ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు ఆదినారాయణ, దస్తగిరి, పెద్దయ్య, శివకృష్ణ తదితరులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



జాకీర్ మృతదేహం

తాడిపత్రి, జూలై 2: మండలంలోని అర్జాస్‌స్టీల్‌ప్లాంట్ పరిశ్రమ సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డుపై ఉన్న డివైడర్‌ను ఢీకొని తాడిపత్రిలోని గాంధీనగర్‌కు చెందిన జాకీర్ (33) మృతిచెందగా, అక్బర్ తీవ్రంగా గాయపడ్డాడని రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన జాకీర్, అక్బర్ అన్నదమ్ములు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్రవాహనంలో ఇద్దరూ బొందలదిన్నెకు వెళ్లి తిరిగి వస్తుండగా అర్జాస్‌స్టీల్ పరిశ్రమ వద్ద రోడ్డు పక్కన ఉన్న మట్టిదిబ్బ కనిపించకపోవడంతో దానిని ఎక్కించి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ సంఘటనలో కిందపడిన జాకీర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అక్బర్ తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదుచేస్తామని సీఐ తెలిపారు.

పెన్నహోబిలం వద్ద..

ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం వద్ద మంగళవారం కర్ణాటక ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఢీ కొనగా రాజశేఖర్(26) అనే వ్యక్తి మృతి చెందాడు. అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన రాజశేఖర్ కుటుంబసభ్యులతో కలిసి పెన్నహోబిలానికి దైవదర్శనానికి వెళ్లాడు. స్వామిని దర్శించుకున్న అనంతరం ద్విచక్రవాహనంలో అనంతపురానికి వెళ్తుండగా అనంతపురం వైపు నుంచి వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీకొన్నాయి. దీంతో స్కూటీలో ప్రయాణిస్తున్న రాజశేఖర్, ఓబులేశుకు తీవ్రగాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజశేఖర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. పోలీసులు అనంతపురం ఆసుపత్రిలో ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



కుందుర్పిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు తదితరులు

కుందుర్పి, జూలై 2: స్టాప్ డయేరియా, డెంగీ మాసోత్సవాలు, ఈ నెల 18 నుంచి గ్రామాల్లో నిర్వహించవలసిన కుష్టువ్యాధి సర్వేపై కుందుర్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించారు వర్షాకాలం మొదలైనందున గ్రామాలలో తీసుకోవాల్సిన చర్యలపై వివరించేందుకు వైద్య అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా అధికారి తిరుపాలయ్య, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో డెంగ్యీ నివారణపై అవగాహన ర్యాలీలను మంగళవారం నిర్వహించారు. మండలకేంద్రంలో వైద్యశాల నుంచి పాల్తూరు బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాదుల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని పాల్తూరు వైద్యులు అనూరాధ తెలిపారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, జైనాబీ డయేరియాపై అవగాహన కల్పించారు. డయేరియాతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా సోకితే చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యమవుతుందని వైద్యులు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్ తెలిపారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం యాడికి ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది శ్రీనివాసులు, మద్దిలేటి, జుబేదా, పలువురు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పలు పాఠశాలలు

సీజ్ చేయాలి: టీఎన్ఎస్ఎఫ్ డిమాండ్

ఉరవకొండ, జూలై 2: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యాలయం వద్దకు రావాలని చెప్పిన ఎంఈఓ ఈశ్వరయ్య ఇప్పుడు ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేశారని మండిపడ్డారు. పలు పాఠశా లలను ఒకచోట అనుమతి పొంది, మరోచోట నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయంపై వారు డీవైఈఓతో ఫోన్‌లో మాట్లాడారు. ఎంఈఓ స్పందించని పక్షంలో జిల్లా నుంచి అధికారులను పంపుతామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వన్నూర్, యోగేష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బంజారా నాయకులు

ఉరవకొండ, జూలై 2: బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితను బంజారా సంఘం నాయకులు కేశవ్‌నాయక్, మహేష్ నాయక్, మాజీ జడ్పీటీసీ తులసీదాస్ కలిశారు. పెనుకొండలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం మంత్రిని కలిసి సత్కరించినట్లు వారు తెలిపారు. గిరిజనుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బంజారాల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహరాజ్ జన్మస్థలం సేవాఘడ్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని విన్నవించినట్లు తెలిపారు.

తాగునీటిలో విషం.. వైసీపీ సర్పంచ్ పనే..

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

కణేకల్లు, జూలై 2: రాజకీయ స్వార్థం కోసం ఓట్లు వేసి గెలిపించిన ప్రజల ప్రాణాలను తీయాలని చూశాడు ఓ సర్పంచు. గ్రామంలో ఆధిపత్యం కోసం ప్రజలు తాగే మంచినీటిలో పురుగులమందు కలిపించాడు. ప్రజలు వాసన పసిగట్టడంతో ప్రాణాలతో బయట పడ్డారు. అనంతపురం జిల్లా కణేకల్లు మండలం తుంబిగనూరులో జూన్ 14న ఈ ఘటన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాగునీటిలో విషం కలిపినట్లు కేసు నమోదు చేసిన పోలీసులు.. భిన్నమైన కోణాల్లో దర్యాప్తు చేశారు. వైసీపీ మద్దతు సర్పంచ్ ఫణీంద్ర గౌడ, ఆయన తండ్రి తిప్పయ్య, వైసీపీ వర్గీయులు కొట్రేగౌడ, హనుమంతు, ఆనందగౌడ ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తేల్చారు. సర్పంచ్ ఫణీంద్రగౌడ పరారీలో ఉండగా, మిగిలిన నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల గ్రామంలోని శుద్ధ జల కేంద్రం సర్పంచ్ అధీనంలోనే ఉన్నింది. అధికారం మారినందున.. ఆనవాయితీ ప్రకారం వాటర్ ప్లాంట్‌ను తమకు అప్పగించాలని టీడీపీ నాయకులు కోరారు. అలా చేయడం ఇష్టంలేని సర్పంచ్.. వాటర్ ప్లాంట్ ట్యాంకులో పురుగుల మందు కలిపి, టీడీపీ వారిపై నింద మోపాలని చూశాడు. సర్పంచ్ సూచన మేరకు ఆయన తండ్రి, మరో ముగ్గురు తాగునీటిలో గత నెల 14వ తేదీ రాత్రి విషం కలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఓ ప్రకటన విడుదల చేశారు. నిందితులు మీడియా కంటపడనివ్వలేదు.

బంద్‌ను జయప్రదం చేయండి

ఉరవకొండ, జూలై 2: దేశవ్యాప్తంగా ఈ నెల 4న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. నీట్ లీకేజీకి కారణమైన సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేయాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు హారుణ్ రషీద్, నవీన్‌కుమార్, శివకృష్ణ, హిరణ్య పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు తాడిపత్రి వాసి



మహమ్మద్‌షా తమీం

తాడిపత్రి, జూలై 2: తాడిపత్రి ఆర్డీటీ క్యాంపునకు చెందిన క్రీడాకారుడు మహమ్మద్‌షా తమీం అండర్-16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడని ఆర్డీటీ ఏటీఎల్ లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2నుంచి 20వరకు విజయనగరంలో జరిగే అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో మహమ్మద్‌షా పాల్గొంటాడని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపిక కావడం పట్ల సీనియర్ కోచ్ సాధిక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్‌లు హర్షం వ్యక్తం చేశారు.